క్లుప్తంగా

ఘనంగా సంకట చతుర్దశి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ జంక్షన్‌లోని బాలగణపతి దేవాలయంలో శనివారం సంకట హర చతుర్థశి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు గిరి ఆధ్వర్యాన ప్రత్యేక అభిషేక పూజలు చేయగా.. దేవాలయ అధ్యక్ష, కార్యదర్శి బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, లింగయ్య, సక్కుబాయి, జనార్దన్, అరుణజ్యోతి, కుందన్, జగత్ తదితరులు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ఇస్రోలో ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు



ఇస్రో శాస్త్రవేత్తలతో విద్యార్థినులు

ఖమ్మంరూరల్: ఇస్రోలో ఉన్న ఉద్యోగావకాశాలపై ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బెంగళూరుకు చెందిన ఇస్రో శాస్త్రవేత్త వల్లూరు ఉమామహేశ్వరరావు పాల్గొని చంద్రయాన్–3 విజయంలోని కీలక అంశాలను వివరించారు. విద్యార్థులు పరిశోధనలపై పట్టు సాధించాలని, కోడింగ్ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అలాగే, శాటిలైట్ కమ్యూనికేషన్స్, స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్‌లో ప్రాథమిక జ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్త మౌనికసుప్రియ, కళాశాల చైర్మన్ కె.నవీన్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను తగలబెట్టొద్దు



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ

కూసుమంచి: రైతులు వరి పొలాలను కోసిన తరువాత పంట అవశేషాలను తగలబెట్టొద్దని, దీని వలన పలు నష్టాలు జరుగుతాయని మండల వ్యవసాయాధికారి వాణి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో రైతులు తగలబెట్టిన వరి పంట అవశేషాలను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అవశేషాలను తగలబెట్టటం వలన భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు నశించడంతో పాటు సేంద్రీయ కర్బనం కూడా దెబ్బతింటుందన్నారు. రైతులు పంట అవశేషాలను భూమిలో కలియదున్నితే సేంద్రీయ పదార్థాలు పెరుగుతాయని, ఈ సూచనలను రైతులు పాటించాలని ఏఓ కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు 2
సాయిరాం	రత్నం
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	2
పచ్చిమిర్చి	54		10
కాకర	34	చుక్కకూర	2
బీర	40		10
దొండ	28	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	86	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

చలువ పందిరి.. పచ్చని లోగిలి!

సండే స్పెషల్

- ఒక్క మొక్క కూడా చనిపోకుండా రక్షణ చర్యలు
- నర్సరీల్లో షేడ్‌నెట్లు ఏర్పాటు
- వన నర్సరీలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ
- హరితహారానికి సిద్ధమవుతున్న మొక్కలు



షేడ్‌నెట్ ఏర్పాటుతో కళకళలాడుతున్న మొక్కలు



మొక్కలపై ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

కామేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం అమలుపై అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. పల్లెల్లో పచ్చదనం వెల్లివిరియాలని, ఈ పథకం కింద మొక్కలు నాటించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో వందశాతం హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయడానికి నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడుతున్నారు. వాటిలో ఒక్క మొక్క కూడా చనిపోకుండా నిరంతరం నీరందిస్తూ.. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చలువ పందిళ్ల(షేడ్‌నెట్లు)ను ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు.

మండలంలో 24 నర్సరీలు..

కామేపల్లి మండలంలో 24 నర్సరీల్లో ఎండవేడిమి నుంచి మొక్కల సంరక్షణకు 24 షేడ్‌నెట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 5 వేల మొక్కలు పెంచుతుండగా.. అన్ని నర్సరీల్లో కలిపి మొత్తం లక్షా ఇరువై వేల మొక్కలు పెంచబడుతున్నాయి.

లక్ష్య సాధనకు కృషి..



పల్లెల్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నాం. నర్సరీల్లోని మొక్కలను కాపాడుకునేందుకు షేడ్‌నెట్లను ఏర్పాటు చేశాం. మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్, ఎంపీడీఓ

ప్రతీ మొక్కను సంరక్షిస్తున్నాం..



నర్సరీలోని ప్రతీ మొక్కను సంరక్షిస్తున్నాం. ప్రతినిత్యం రెండు పూటలా మొక్కలకు నీరు పడుతుండడంతో పాటు మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్లను ఏర్పాటు చేశాం. వచ్చే హరితహారం కార్యక్రమం వరకు మొక్కలను సిద్ధం చేస్తున్నాం.

– అజ్మీరా రమేష్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్

కేసీఆర్ పర్యటనను జయప్రదం చేయండి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తరఫున ప్రచారానికి పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈనెల 29న ఖమ్మంలో పర్యటించనున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో శనివారం ఆయన కార్పొరేటర్లు, ఖమ్మం, రఘునాథపాలెం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. కేసీఆర్ బస్సు యాత్ర విజయవంతానికి నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈసమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్‌ఎస్ నగర, రఘునాథపాలెం మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, వీరూనాయక్‌తో పాటు బచ్చు విజయ్‌కుమార్, గుత్తా రవి, మాదంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, బి.లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు తరలిరావాలి..

కామేపల్లి: మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ కోరారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 29న ఖమ్మంలో జరిగే మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోకు తరలిరావాలని సూచించారు. కాంగ్రెస్ హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని తెలిపారు. నాయకులు ఆంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి, బానోత్ రాందాస్, భట్టు శంకర్, సామా మోహన్‌రెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, కాత్రాల రాంబాబు, తూము బాబు, దుద్దుకూరి రాంబాబు, పుచ్చకాయల బాబు, కొనకంచి శంకర్, సూర్యం, బానోత్ రవి, మంగు, హేమ్లానాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ ఎస్‌ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ ఆర్టీఓ ఆఫీస్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బైపాస్ రోడ్, కొత్త బస్టాండ్ ఏరియా, వికలాంగుల కాలనీ, రమణగుట్ట, శ్రీరాంగిరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిందితులను శిక్షించాలి



కూల్చిన ఇంటిని పరిశీలిస్తున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇల్లు కూల్చివేతకు యత్నించి, మహిళలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం శ్రీనగర్‌కాలనీలో కొందరు కూల్చిన ఇంటిని ప్రజా, మహిళా సంఘాలతో ఆయన సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు భద్రూనాయక్, నాగయ్య, పద్మ, దినకుమారి, ఉష, ఝాన్సీ, చందు, కృష్ణవేణి, సుశీలబాయి, స్వాతి, రవీందర్‌నాయక్, వీరన్ననాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చింతనిప్పు కృష్ణచైతన్య రాజీనామా చేశారు. శనివారం ఈమేరకు తన రాజీనామా చేస్తున్నట్లు రాసిన లేఖను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధులకు పంపించారు. ఇంతకాలం తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పరామర్శ

తిరుమలాయపాలెం: మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొప్పుల అశోక్ మాతృమూర్తి కొప్పుల ప్రమీల ఇటీవల మృతిచెందారు. ఈమేరకుశనివారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి తిరుమలాయపాలెంలో అశోక్‌ని వేర్వేరుగా పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రమీల చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం అరవింద రెడ్డి, గోళ్ల లింగయ్య, బోడ సుదర్శన్, షేక్.కరీం, మాజీ సర్పంచ్‌లు గడ్డికొప్పుల రాజు, నల్లబెల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి..

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడి మాజీ ఎంపీటీసీ శ్రావణ సీతారామయ్య(72) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. సీతారామయ్యకు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావీద్, కోటయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

'ఉపాధి' కూలీలు నిబంధనలు పాటించాలి



నేలకొండపల్లి: బైరవునిపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ సునీత

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనలను కూలీలు కచ్చితంగా పాటించాలని ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, తిరుమలాయపాలెం మండల ఎంపీపీ బోడ మంగీలాల్ సూచించారు. శనివారం నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లిలో జరుగుతున్న ఉపాధి పరిశీలించిన సందర్భంగా సునీత, తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంగీలాల్ మాట్లాడారు. ఈనేపథ్యాన కూలీలతో మాట్లాడి మస్టర్లను పరిశీలించారు. కూలీలు సమయపాలన పాటించాలని, మస్టర్‌లో పేర్లు ఉన్న వారు మాత్రమే పనికి రావాలని, కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉదయం 6 గంటలకే పని వద్దకు చేరుకోవాలని, పని ప్రదేశాలలో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కాగా, ఎన్నికల నేపథ్యాన తిరుమలాయపాలెం మండల పరిషత్ సమావేశానికి సభ్యులు సరిగా హాజరు కాకపోవడంతో ఎలాంటి తీర్మానాలు లేకుండా ముగించారు. నేలకొండపల్లి కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ యాకయ్య, క్షేత్ర సహాయకుడు బి.వెంకటేశ్వర్లు పాల్గొనగా, తిరుమలాయపాలెం కార్యక్రమంలో ఎంపీడీ శేషాద్రి, తహసీల్దార్ పి.వి రామకృష్ణ, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బుద్ధా వంశీకృష్ణ, డీటీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది గంటల పని కోసం పోరాడాలి..

ఖమ్మంమయూరిసెంటర్: పెట్టుబడుదారి విధానానికి, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పనిదినాలకై కార్మికులు పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కమిటీ సమావేశం బొమ్మకంటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తుల కోసం ప్రభుత్వాలు మరోసారి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా, 12 గంటల పనిదినాల విధానం కోసం ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. మేడే స్ఫూర్తితో కేంద్ర విధానాలపై పోరాటాలు చేసి హక్కులను సాధించుకోవాలని, రాబోయే ఎన్నికల్లో హిందూ పాసిజానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు జె.రాంబాబు, తిరుపయ్య, శ్రీను, రాంబాబు, రమేష్, శోభన్, మహేష్, ఉపేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గాగోపాల్‌రెడ్డిని పార్టీ నియమించడంతో శనివారం మండలంలోని పాతలింగాలలో గల ఆయన నివాసంలో మండల పార్టీ ఆధ్వర్యాన సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమైందని, అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా కష్టపడాలన్నారు. అనంతరం గోపాల్‌రెడ్డి సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, ఆరెం రవి, దమ్మాలపాటి సత్యనారాయణ, ధరావత్ అనురాధ, దేవండ్ల రామకృష్ణ, బానోత్ నరసింహానాయక్, మేకపోతుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలకు రైతులు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మంమయూరిసెంటర్: రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు రైతులు సిద్ధం కావాలని ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పార్టీలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మర్చిపోతున్నాయని అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తే, రూ.2 లక్షల రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తూ కాలం వెళ్లదీస్తుండడంతో, రైతాంగ సమస్యల పరిష్కారం కోసంవచ్చే నెల 15వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు మండల జిల్లా కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, సహాయకార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, నాయకులు మారుతి మల్లయ్య, కుర్ర వెంకన్న, భానోత్ శంకర్, వడ్డే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆవుల మంగతాయి

తిరుమలాయపాలెం: గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణతో యువతీయువకులు మద్యానికి బానిసలై మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి అన్నారు. శనివారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం పాలేరు డివిజన్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మద్యానికి తోడుగా డ్రగ్స్, గంజాయి, నాటు సారా తదితర మత్తు పానీయాలకు అలవాటు పడి అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్టు షాపులను రద్దు చేస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మద్యాన్ని కేవలం ఆదాయ వనరులుగానే చూస్తుందని, జిల్లాలో మంచినీరు లేని గ్రామాలు ఉన్నాయి కానీ బెల్ట్ షాపులు లేని గ్రామం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజన అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకురాలు గొడుగు ముత్తమ్మ, కుంభజడ భారతమ్మ, గౌని పద్మ పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్



పోలీసు బలగాల కవాతు

ఖమ్మంక్రైం: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఈమేరకు శనివారం ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేవతి సెంటర్ నుంచి జెండాల సెంటర్ వరకు సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టామని, అందులో భాగంగానే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాను చెక్ పెట్టేందుకు చెక్ పోస్టులు, పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు భానుప్రకాశ్, ఉదయ్‌కుమార్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి తొలగించడమే ఎస్‌ఎఫ్‌ఐ లక్ష్యం

ఖమ్మంరూరల్: విద్యార్థులకు పరీక్షలంటే ఒత్తిడి, భయం లేకుండా చేయటమే ఎస్‌ఎఫ్‌ఐ లక్ష్యమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. మండలంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మోడల్ ఎంసెట్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడల్ టెస్టుల ద్వారా విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శులు సంగీత, ప్రేమ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఉమేష్, హేమంత్, ఉమేష్, మహేష్ పాల్గొన్నారు.

'తపాలా ఉద్యోగులపై నిరంకుశత్వం'



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: హక్కుల కోసం పోరాడే తపాలా ఉద్యోగులపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిరంకుశత్వంతో వ్యవహరిస్తున్నారని ఎన్‌ఎఫ్‌పీఈ సంఘం నేతలు ధ్వజమెత్తారు. శనివారం ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రావణ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగులపై అశాస్త్రీయ లక్ష్యాలను విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న హక్కులను కూడా పాలకులు కాలరాస్తుండగా.. ఉద్యోగులు, కార్మికులు ఐక్య పోరాటాలతో హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు బండి జయరాజు, పట్టాభి, మౌలాలి, జిల్లా కార్యదర్శులు బందెల నాగరాజు, పెరుగు నాగేశ్వరరావు, ఏలూరి శ్రీనివాసరావు, శ్రీనివాస్, తుమ్మ కనకయ్య, రవీందర్, మల్లయ్య, రాజేశ్వరి, రాణి, రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేస్తున్న కార్టూన్లు..



నవాబ్ గీసిన కొన్ని చిత్రాలు

- సమాజాన్ని మేల్కొపేలా చిత్రీకరణ
- అద్భుత సందేశాలతో వాట్సాప్ గ్రూపుల్లో షేరింగ్
- జవాన్‌ను అభినందిస్తున్న ప్రజలు



షేక్ నవాబ్

ఖమ్మంవన్‌టౌన్: ఎల్లప్పుడూ తన డివిజన్ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నిత్యం బిజీబిజీగా తన పనిలో నిమగ్నమయ్యే నగరపాలక సంస్థ 14వ డివిజన్‌కు చెందిన మున్సిపల్ జవాన్ షేక్ నవాబ్ తన కార్టూన్స్‌తో అందరిని ఆలోచింపచేస్తున్నారు. భిన్నంగా ఆలోచిస్తూ సమయానుకూలంగా సమాజంపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంటాడు. డివిజన్ ప్రజలందరూ ఉన్న పలు వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉంటూ నేటి సమాజపు వింత పోకడలు మొదలుకుని, తను పనిచేస్తున్న నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్చేలా ప్రజలను జాగృతపరుస్తూ వస్తున్నాడు. ప్రతీ రోజు మనిషిని ఆలోచింపచేసేలా ఒక మంచి సందేశాన్ని తీసుకుని దానికి ఒక విచిత్రమైన, సందర్భోచితంగా ఉన్న బొమ్మను జతచేస్తూ గ్రూపుల్లో పెడుతుంటాడు. 50 ఏళ్లకు పైగా ఉన్న నవాబ్ కార్టూన్స్‌తో పాటు పాటలు పాడుతూ సెల్ఫీ వీడియోలు సైతం చేస్తుంటాడు. తన ఉద్యోగ బాధ్యత తను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సమాజంను చైతన్యపరుస్తూ అందరి అభినందనలు అందుకుంటున్నాడు. ఈ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యలతో పాటు డివిజన్‌లో ఉన్న పలువురు నవాబ్‌ను అభినందిస్తున్నారు.